RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 237 పేజీలు - 08 గురువారం 23 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# నీట్‌పై చర్చకు సిద్ధం..

### రాజకీయాలు చేయొద్దు: కేంద్రం

- విద్యార్థుల అంశంపై రాజకీయాలు వద్దని నడ్డా సూచన
- ఎన్డీయేతర రాష్ట్రాల్లోనూ పేపర్ లీకులు జరిగాయన్న మంత్రి
- ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చకు రావాలని పిలుపు
- సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించాలని కోరిన నడ్డా
- ప్రధాన్ రాజీనామాపై సభలోనే చర్చించాలని సూచన

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 22:**
నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించొద్దని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు.బుధవారం మీడియాతో మాట్లాడిన నడ్డా.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం నీట్ అంశాన్ని

మిగతా 2లో.



## పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

- ఒక్క దాంటలో కూడా దోషులను తేల్చలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్



2లో.

## సిసిఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ



**తొలి అక్షరం/హైదరాబాద్:జూలై 22:**
ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,

మిగతా 2లో.

# మోడీపై పోరాటానికి కాంగ్రెస్ సిద్ధం

: కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి



- మోడీ క్షమాపణ చెప్పాలి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలి
- విద్యార్థులపై పాశవిక దాడిని ఖండిస్తున్నాం
- ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలు..
- ఆయనను గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందాం




**తొలి అక్షరం/కొడంగల్:జూలై 22:**
దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పి.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా

మిగతా 2లో.

## నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం

- రెండేళ్లపాటు సీఈవోగా బాధ్యతలు నిర్వహణ
- 1989 బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి
- కేంద్రం, రాష్ట్రాల్లో నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం
- విధానాల రూపకల్పన, అమలులో కీలక బాధ్యతలు
- 'వికసిత్ భారత్' లక్ష్యాలకు నాయకత్వం




2లో.

## అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్
- 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ఆమోదం
- సేకరించే ధాన్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు
- ప్రధాని మోదీకి కృతజ్ఞత తెలిపిన కేంద్రమంత్రులు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 22:**
తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి

మిగతా 2లో.

## "మా సమయం వృథా చేయొద్దు"

- : విద్యార్థుల నిరసనపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం
- విద్యార్థుల నిరసనపై పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్
- తక్షణ విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ:జూలై 22:**
జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశాన్ని ప్రస్తావించగా, "మా సమయం వృథా చేయొద్దు" అంటూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్

మిగతా 2లో.



## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

- 'ఎల్ నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ
- 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్'
- అప్పుల రీస్ట్రక్చరింగ్‌తో డిస్కంలను నంబర్-1గా తీర్చిదిద్దే ప్రణాళికలు
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష




**తొలి అక్షరం/హన్మకొండ:జూలై 22:**
'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్

మిగతా 2లో.

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు




- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం -గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత -రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్

**తొలి అక్షరం/హైదరాబాద్:జూలై 22:**
కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు

మిగతా 2లో.



# “మా సమయం వృథా చేయొద్దు”

**మొదటిపేజీ తరువాయి**

నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇవాళ ఉదయం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాటిని పరిశీలించి, రేపు (గురువారం) విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. “మేము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు” అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు. జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్ వంటి పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత జులై 20, 21 తేదీల్లో ‘చలో సంసద్’ కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున జంతర్ మంతర్ వద్ద ఈ నిరసన చేపట్టగా, అది ఉద్రిక్తంగా మారింది.

పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను అడ్డుకునేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు సమాచారం. అయితే, ఆందోళనకారులు హింసాత్మకంగా, అదుపు తప్పి ప్రవర్తించారని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు.

ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను నిన్న ఢిల్లీ హైకోర్టు కూడా అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం, “ఇలాంటి అన్ని విషయాల్లోకి కోర్టును లాగొద్దు” అని వ్యాఖ్యానిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది.

ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ఇదే తరహాలో స్పందించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు రెండూ తక్షణ విచారణకు నిరాకరించడంతో పిటిషనర్లు ఇప్పుడు సాధారణ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా తమ పిటిషన్ ఎప్పుడు విచారణకు వస్తుందో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

**మొదటిపేజీ తరువాయి**

వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగు తున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 ఆంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని ఆంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని... మెసేజ్ ఆధారంగా ఆంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్లు బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు.

# మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

నిరసన తెలిపితే పాశవికంగా దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్‌లో భారీ నిరసనా ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్‌తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి సీఎం కాలినడకన అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రాలను అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా ఆయా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన బాధ్యులను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అని ప్రశ్నించారు. విద్యార్థినులపై దుర్మారంగా దాడి చేయడమే కాకుండా.. విద్యార్థుల తలలు పగులగొట్టారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులకు మద్దతుగా



రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని ఇంటి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపితే వారిపై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఈ దాడిలో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని గుర్తు చేశారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు.

**దేశాన్ని దోచుకుంటున్న నరేంద్ర, ధర్మేంద్ర**

ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందని తెలిపారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ కోఎంప్ట్ ఎడ్యుటెక్‌గా పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందన్నారు. ఢిల్లీ బీజేపీ నేతలతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారని తెలిపారు. దీంతో నీట్ పరీక్ష నిర్వహించడంతో అవకతవకలకు పాల్పడొచ్చన ధైర్యం వాళ్లకు వచ్చిందన్నారు. బీజేపీ దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి.. మోడీపై పోరాటానికి సిద్ధంగా ఉందన్నారు. అందరం కలిసి పోరాడి మోడీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 22:**

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బ్జడెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

## అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

## నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 22:**

సీనియర్ ఐఏఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నీతి ఆయోగ్ కొత్త ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో)గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఆయన రెండేళ్లపాటు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు.1989 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన అనురాగ్ జైన్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం ఉంది. కేంద్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల్లో పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, పెట్టుబడుల ప్రోత్సాహం, పరిపాలనా సంస్కరణల అమలులో విశేష అనుభవాన్ని సంపాదించారు.నీతి ఆయోగ్ సీఈవోగా ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలు, రాష్ట్రాలతో సమన్వయం, దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధనకు అవసరమైన విధానాల అమలును ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలపై నీతి ఆయోగ్ చేపడుతున్న కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు.

# నీట్‌పై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందన్నారు. అయితే ప్రతిపక్షాలు విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూస్తున్నాయని విమర్శించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక వంటి ఎన్డీయేతర పాలిత రాష్ట్రాల్లో కూడా పేపర్ లీక్ ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. వాటిపై ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.పార్లమెంట్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఎంత సమయం కేటాయించినా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నడ్డా తెలిపారు. పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా మార్చేందుకు ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రిలో పరామర్శించినట్లు నడ్డా వెల్లడించారు. ఆయన దీక్ష విరమించి యువతకు సానుకూల దిశలో నాయకత్వం వహించాలని కోరినట్లు చెప్పారు. వాంగ్‌చుక్ ప్రభుత్వానికి లేఖ రాశారని, దానికి తగిన విధంగా స్పందిస్తామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై స్పందించిన నడ్డా.. అలాంటి అన్ని అంశాలపై పార్లమెంట్‌లోనే చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

**మొదటిపేజీ తరువాయి**

గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## సిసిఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

**మొదటిపేజీ తరువాయి**

సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷-లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

# సైలెంసర్లు మారాలి.. సైరన్లు ఆగాలి

**- బ్లాక్ ఫిల్మ్‌లు, మల్టీ-టోన్ హారన్లపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం**

**- ఒక్కరోజే 823 కేసులు..**

**రూ.6.9 లక్షల జరిమానా విధింపు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై22:** రోడ్డు భద్రతను పటిష్టం చేయడం, మోటారు వాహనాల నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో భాగంగా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు బుధవారం కమిషనరేట్ వ్యాప్తంగా భారీ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా వాహన అద్దాలకు అమర్చిన బ్లాక్ ఫిల్మ్‌లు/టింటెడ్ గ్లాస్‌లు, సైరన్లు మరియు బహుళ స్వరాల హారన్లను ఉపయోగించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీలు కే.రాహుల్ రెడ్డి, వి. శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు,సిబ్బంది ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాలు, రద్దీ రహదారులపై ఈ తనిఖీలు చేపట్టారు.


Malkajgiri Commissionerate Special Drive Cases on Tinted glass/Black film ,Multi Toned / Air Horn & Siren Dt: 22.07.2026


| S.No | Police station | Tinted glass/ Black film | | Multi Toned / Air Horn | | Siren | | Grand total | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Cases | Amount | Cases | Amount | Cases | Amount | Cases | Amount |
| 1 | Malkajgiri Tr PS | 77 | 53900 | 7 | 7000 | 0 | 0 | 84 | 60900 |
| 2 | Gopalpuram Tr PS | 67 | 46900 | 22 | 22000 | 3 | 3000 | 92 | 71900 |
| 3 | Jawaharnagar Tr PS | 3 | 2100 | 30 | 30000 | 0 | 0 | 33 | 32100 |
| 4 | Trimulgherry Tr PS | 46 | 32200 | 44 | 44000 | 6 | 6000 | 96 | 82200 |
| 5 | Alwal Tr PS | 44 | 30800 | 101 | 101000 | 5 | 6000 | 150 | 137800 |
| 6 | Begumpet Tr PS | 29 | 20300 | 20 | 20000 | 10 | 10000 | 59 | 50300 |
| | Zone- I | 266 | 186200 | 224 | 224000 | 24 | 25000 | 514 | 435200 |
| 1 | LB Nagar Tr PS | 28 | 19600 | 54 | 54000 | 1 | 1000 | 83 | 74600 |
| 2 | Vanasthalipuram Tr PS | 45 | 31500 | 24 | 24000 | 0 | 0 | 69 | 55500 |
| 3 | Uppal Tr PS | 27 | 18900 | 43 | 43000 | 0 | 0 | 70 | 61900 |
| 4 | Kushaiguda Tr PS | 37 | 25900 | 0 | 0 | 0 | 0 | 37 | 25900 |
| 5 | Ghatkesar Tr PS | 42 | 29400 | 8 | 8000 | 0 | 0 | 50 | 37400 |
| | Zone- II | 179 | 125300 | 129 | 129000 | 1 | 1000 | 309 | 255300 |
| | Total | 445 | 311500 | 353 | 353000 | 25 | 26000 | 823 | 690500 |

Section:
Tinted glass/Black Film (MV Rule 100, S 177/179(1) MV Act
Multi Toned Horn / Air Horn (119(2)CMVR/177 MVA)
Siren (119(2)CMVR/190(2)MVA)

**రూ.6.9 లక్షల జరిమానా:** ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 823 వాహనాలపై కేసులు నమోదు చేశారు. బ్లాక్ ఫిల్మ్స్ / టింటెడ్ గ్లాస్: 445 కేసులు నమోదు చేసి, రూ. 3,11,500 జరిమానా విధించారు. సైరన్లు / మల్టీ-టోన్ హారన్లు: 378 కేసులు నమోదు చేసి, రూ. 3,79,000 జరిమానా వేశారు. **శాంతిభద్రతలకు విఘాతం..శబ్ద కాలుష్యం:** అనుమతి లేని బ్లాక్ ఫిల్మ్‌ల వల్ల వాహనం లోపల ఉన్నవారిని గుర్తించడం కష్టమై, నేరాలకు ఆస్కారం ఉంటుందని మరియు సీసీ కెమెరాల నిఘాకు అడ్డంకిగా మారుతుందని పోలీసులు స్పష్టం చేశారు. అలాగే ప్రైవేటు వాహనాలకు సైరన్లు, ఒత్తిడి హారన్లు అమర్చుకోవడం వల్ల తీవ్ర శబ్ద కాలుష్యం ఏర్పడటంతో పాటు ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మితమైన శబ్ద పరిమితికి మించి హారన్లు వాడకూడద ని, ప్రైవేటు వాహనాలకు సైరన్లు, బ్లాక్ ఫిల్మ్‌లు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సురక్షితమైన ప్రయాణం మరియు క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ కోసం ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీసీపీ ప్రకటనలో తెలిపారు.

# ప్రధాని మోదీ ఆప్యాయతకు పింగళి వెంకటేశ్వరరావు ప్రత్యేక గౌరవం




**● ప్రతి ఏడాది జన్మదిన శుభాకాంక్షలు ● ఇది కేవలం శుభాకాంక్ష కాదు... దైవానుగ్రహంతో లభించిన పవిత్ర ఆశీర్వాదం ● 'తొలి అక్షరం'చీఫ్ ఎడిటర్ పి.సైదులు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై22:** దేశ ప్రధానిగా కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా,నిరంతర ప్రజాసేవలో నిమగ్నమై ఉన్నప్పటికీ,వ్యక్తిగత అనుబంధాలకు, ఆత్మీయతకు, మానవీయ సంబంధాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిత్వానికి పింగళి వెంకటేశ్వరరావుకు ప్రతి ఏడాది అందుతున్న జన్మదిన శుభాకాంక్షలు ఒక విశిష్ట నిదర్శనమని 'తొలి అక్షరం' చీఫ్ ఎడిటర్ పి. సైదులు పేర్కొన్నారు.పింగళి వెంకటేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన పి.సైదులు, ప్రధాని నరేంద్ర మోదీతో పింగళి వెంకటేశ్వరరావుకు ఉన్న ప్రత్యేక అనుబంధం, ఆత్మీయతను ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు.

**ప్రధాని హోదా పెరిగినా... ఆప్యాయత మాత్రం మరింత పెరిగింది:**

నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రతి ఏడాది పింగళి వెంకటేశ్వరరావు జన్మదిన సందర్భంగా క్రమం తప్పకుండా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని తొలి అక్షరం చీఫ్ ఎడిటర్ పి. సైదులు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా,దేశీయ,అంతర్జాతీయ వ్యవహారాల్లో నిరంతరం నిమగ్నమై ఉండే అత్యంత బిజీ షెడ్యూల్ మధ్య కూడా తనకు పరిచయమైన వ్యక్తులను, తనతో ఆత్మీయ అనుబంధం ఉన్నవారిని గుర్తు పెట్టుకుని వారి ప్రత్యేక సందర్భాల్లో శుభాకాంక్షలు తెలియజేయడం ప్రధాని మోదీ విశిష్ట వ్యక్తిత్వానికి నిదర్శనమని ఆయన అన్నారు.పదవి ఎంత ఉన్నతమైనదైనాడమనుషుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరచిపోకపోవడం గొప్ప నాయకత్వ లక్షణం.ప్రధాని మోదీ ఆప్యాయతలో ఇదే మానవీయ కోణం స్పష్టంగా కనిపిస్తుంది అని పి. సైదులు పేర్కొన్నారు.ఒక శుభాకాంక్ష వెనుక ఉన్న ఆత్మీయత జన్మదిన శుభాకాంక్ష అనేది సాధారణంగా పలకరింపుగా కనిపించినప్పటికీ, దేశ ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న ఒక వ్యక్తి ప్రతి ఏడాది ఒకే వ్యక్తిని గుర్తు పెట్టుకుని శుభాకాంక్షలు తెలియజేయడం అత్యంత అరుదైన విషయమని పి.సైదులు అన్నారు.పింగళి వెంకటేశ్వరరావుకు అందుతున్న ఈ శుభాకాంక్షలు కేవలం ఒక వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలతో ఏర్పరచుకున్న బలమైన మానవీయ అనుబంధానికి ప్రతిబింబమని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రజలతో మమేకం కావడం, వారి భావాలను అర్థం చేసుకోవడం,సంబంధాలను గౌరవించడం ప్రధాని మోదీ నాయకత్వ శైలిలోని ప్రత్యేకతలని ఆయన కొనియాడారు.

**నా జీవితంలో ఇది అరుదైన గౌరవం:**

ఈ సందర్భంగా పింగళి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ....ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రతి ఏడాది నా జన్మదినాన శుభాకాంక్షలు అందుకోవడం నాకు దక్కిన అత్యంత అరుదైన గౌరవం.దేశ ప్రధానమంత్రి వంటి అత్యున్నత బాధ్యతల్లో ఉన్న వ్యక్తి తన బిజీ షెడ్యూల్‌లోనూ నన్ను గుర్తు చేసుకుని శుభాకాంక్షలు తెలియజేయడం నాకు ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగిస్తుంది.ఆయన చూపుతున్న ఈ అభిమానం, ఆప్యాయత ప్రజలతో మమేకమయ్యే ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రధాని మోదీతో ఉన్న ఈ అనుబంధాన్ని నేను ఎంతో గౌరవంగా భావిస్తున్నాను.నా దృష్టిలో ఇది కేవలం జన్మదిన శుభాకాంక్షలు మాత్రమే కాదు దైవానుగ్రహంతో లభించిన పవిత్రమైన ఆశీర్వాదంగా భావిస్తున్నాను.ఈ ఆప్యాయత నాకు జీవితాంతం గుర్తుండిపోయే ఒక గొప్ప అనుభూతి.ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆయన చూపుతున్న ఈ ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను, మరింత స్ఫూర్తిని కలిగిస్తున్నాయి. సమాజానికి, ప్రజలకు నా వంతు సేవను మరింత నిబద్ధతతో కొనసాగించడానికి ఇది నాకు గొప్ప ప్రేరణ అని అన్నారు.

**మరిన్ని సత్కార్యాలకు స్ఫూర్తి:**

ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న ఈ అపూర్వమైన ఆప్యాయత, ఆశీస్సులు, సత్కామనలు పింగళి వెంకటేశ్వరరావుకు రాబోయే రోజుల్లో మరిన్ని సత్కార్యాలు చేయడానికి గొప్ప స్ఫూర్తినిస్తాయని 'తొలి అక్షరం' చీఫ్ ఎడిటర్ పి. సైదులు ఆకాంక్షించారు.ప్రజా జీవనంలో నిరంతరం చురుకుగా ఉంటూ, సమాజ సేవకు తన వంతు కృషి చేస్తున్న పింగళి వెంకటేశ్వరరావుకు ప్రధాని మోదీ చూపుతున్న ఈ ఆత్మీయత ఆయన సేవా ప్రయాణానికి మరింత ఉత్సాహాన్ని, నూతన శక్తిని అందిస్తుందని ఆయన అన్నారు.ప్రధాని మోదీ వంటి మహోన్నత నాయకుడి ఆప్యాయత, ఆశీస్సులు ఒక వ్యక్తికి లభించడం నిజంగా అరుదైన గౌరవం.ఆ గౌరవాన్ని మరింత బాధ్యతగా భావించి, సమాజానికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలి అని పి. సైదులు ఆకాంక్షించారు.పింగళి వెంకటేశ్వరరావు జన్మదిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న ఈ ఆప్యాయత, దేశవ్యాప్తంగా ప్రజలతో ఆయనకు ఉన్న మానవీయ అనుబంధానికి మరో ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



తొలి అక్షరం పేపర్ చీఫ్ ఎడిటర్ పి.సైదులు

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



**తొలి అక్షరం/రామన్నపేట జులై 22:** పున్న జగన్మోహన్ మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులు చేపడుతున్న నిరసన కార్యక్రమానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడి చేయడం ద్వారా వేలాది మంది విద్యార్థులు గాయపడిన సంఘటన చూసి ప్రధాన ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ పార్టీ అధినేత చలో పిఎం హౌస్ నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తున్న రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాధానం చెప్పలేక అటు విద్యార్థుల పైన దాడికి సమాధానం చెప్పలేక కుట్రపూరితంగా రాహుల్ గాంధీ పై దాడి చేయడం పిరికిపందల చర్య అని రాహుల్ గాంధీ కుటుంబానికి ఈ దేశం కోసం రక్తం చిందించడం వారి కుటుంబమే ఒక చరిత్ర అని గాంధీ నుంచి నేడు రాహుల్ గాంధీ వరకు ఈ దేశం కోసం రక్తం చిందించినవారు అని తెలుపుతూ. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధానమంత్రి మోడీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్ ఉప సర్పంచ్ మోటె రమేష్ జింకల ప్రభాకర్ రెడ్డి బొడ్డు సాలయ్య సాల్వేర్ అశోక్ వనం చంద్రశేఖర్ మొహమ్మద్ నాసర్ మొహమ్మద్ అక్రమ్ కోట సుధాకర్ మోటె మహేష్ మొహమ్మద్ అంజాత్ కేశవ దాసు వెంకటేష్ మిర్జా అసలం బేగ్ నోముల ప్రవీణ్ కుమార్ మహమ్మద్ రిజ్వా న్ లెక్కల ప్రవీణ్ మొహమ్మద్ అజార్ బండ అంజిరెడ్డి కొండ శేఖర్ గౌడ్ గడ్డం యాదగిరి మీర్జా ఇ నాయ తుల్లా బేగ్ చింతల కృష్ణ స్వామి దామోదర్ రెడ్డి లవణంసాయి ఎండి సమీర్ సైదాచారి తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఇండియా కూటమి నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా..: దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట జులై 22:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ , కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి నాయకులను ఢిల్లీలో జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్నితెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, అలాంటి రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు.దేశంలోని రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు మరియు అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి నాయకులపై ఇటువంటి నిర్బంధ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని పేర్కొన్నారు. అరెస్టులతో ప్రజల గొంతును ఎవరూ అణచలేరని స్పష్టం చేశారు.రాజకీయ కక్షసాధింపు ధోరణిని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకుని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రతిపక్ష నాయకులపై వేధింపులు, అక్రమ అరెస్టులు వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని శ్రీ దైద రవీందర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజల హక్కులు, స్వేచ్ఛలను హరించే చర్యలు దేశ ప్రజాస్వా మ్యానికి తీవ్ర హానికరమని ఆయన పేర్కొన్నారు.రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఇండియా కూటమి నాయకుల అరెస్టును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని దైద రవీందర్ స్పష్టం చేశారు.

# కనుమరుగవుతున్న జానపద కళలను కాపాడుకుందాం: సదుల ఆంజనేయులు

**● జానపద కళల పరిరక్షణకు ప్రభుత్వం, ప్రజలు ముందుకు రావాలి**

**● జై కళామాతల్లి.. సంప్రదాయ కళాసంపదను సంరక్షిద్దాం**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన జానపద కళలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫరూక్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన జానపద కళాభిమాని సదుల ఆంజనేయులు అన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో యక్షగానాలు, బుర్రకథలు, వీధి నాటకాలు, ఎల్లమ్మ ఆటలు, హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, బొబ్బిలి యుద్ధం, బీరప్ప కథ వంటి ఎన్నో జానపద కళారూపాలు ప్రజలను అలరించేవని, నేడు అవి కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావంతో సంప్రదాయ కళలకు ఆదరణ తగ్గిపోవడం బాధాకరమన్నారు. పూర్వతరం కళాకారులు కళను జీవనాధారంగా చేసుకుని అమూల్యమైన కళాసంపదను వారసత్వంగా అందించారని, ఆ సంపదను కాపాడాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. పాతతరం కళాకారులు ఒక్కొక్కరుగా దూరమవుతుండటంతో అనేక జానపద కళారూపాలు శాశ్వతంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.జానపద కళలు, కళాకారులు, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు, ప్రజలు కలిసి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జానపద కళలకు విశేష సేవలందించిన తన తల్లిదండ్రులు కీర్తిశేషులు సదుల బాల్‌శెట్టి, కీర్తిశేషులు సదుల శాంతమ్మ సేవలను స్మరించుకున్నారు. చివరగా "జై కళామాతల్లి" అంటూ జానపద కళల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## మేడి. మంజుల కుటుంబానికి సర్పంచ్ కూనూరు. సాయికుమార్ గౌడ్ ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/రామన్నపేట జులై 22:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి చెందిన మేడి మంజుల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంజుల భర్త మేడి శ్రీరాములు (డ్రైవర్) వారి కుటుంబ సభ్యులను బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పరామర్శించి, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బై కానీ ఉమా మహేష్ యాదవ్, 5వ వార్డు సభ్యురాలు నేరటి మానస సురేష్ యాదవ్, 6వ వార్డు సభ్యురాలు కడారి పావని పాపయ్య, గ్రామ పెద్దలు, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలి

**- బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్**



**తొలి అక్షరం/రామన్నపేట జులై 22:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పాల్గొని బీఎల్ఏలు, బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు, బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, తప్పులు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, నిర్దేశిత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భోగారం ఉప సర్పంచ్ బై కానీ ఉమా మహేష్ యాదవ్ ఐదవ వార్డు మెంబర్ నేరటి మానస సురేష్ యాదవ్ ఆరో వార్డు మెంబర్ కడారి పావని పాపయ్య బి ఎల్ వో లు గ్రామ పెద్దలు యువకులు .పాల్గొన్నారు.

## రైతులకు శాపంగా మారిన బీటి రోడ్డు

- వెల్లంకి -గోల్నేపల్లి రోడ్డును పునరుదద్ధరించాలి
- ధర్మ సమాజ్ పార్టీ రామన్నపేట మండల కార్యదర్శి: నకిరేకంటి స్వామి



**తొలి అక్షరం/రామన్నపేట జులై 22:** మండలంలోని వెల్లంకి గ్రామం నుండి గోల్నేపల్లి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా గుంతలమయం అయ్యి రైతులకు శాపంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో బావుల దగ్గరికి వెళ్లే రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు, అదేవిదంగా ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ బీటి రోడ్డు మార్గాన్ని 2003లో నిర్మించి ఇప్పటికీ ఎలాంటి మరమత్తు చేయకపోవడం వలన రోడ్డు పూర్తిగా కంకర తేలుతూ ప్రయాణికులకు మరియు రైతులకు వారి వాహనాలు పూర్తిగా దెబ్బతినడం తో ఆర్థికంగా కూదే లావుతున్నారు. రోడ్డు వేసి దాదాపు 20 సంవత్సరాల గడుస్తున్నా ఎలాంటి మరమ్మతు లేకుండా పోయింది. ఈ రోడ్డును ఆర్ అండ్ బి, మరియు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ వారు వెంటనే పునరుద్దించాలని ధర్మసమాజ్ పార్టీ రామన్నపేట మండల కార్యదర్శి నకిరేకంటి స్వామి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు రోడ్లను పునరుద్ధరించడంలో విఫలం అయింది. ఈ రోడ్డు మార్గంలో వెళ్లే రోడ్డు రైతులకు వారి వాహనాలకు ఇబ్బంది లేకుండా వెంటనే రోడ్డు పునరుద్ధరించాలని కోరుతున్నాం రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాలకు కూడా నూతన రోడ్లు వేయాలని దెబ్బతిన్నటువంటి రోడ్లను మరమ్మతులు చేయాలని స్వామి తెలియజేశారు. వెల్లంకి నుండి గుండ్రాంపల్లి బిటి రోడ్డు నిర్మించినదుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కి ధన్యవాదములు. అదేవిదంగా ఈ వెల్లంకి నుండి గోల్నేపల్లి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నాం.

## ఓరుగల్లు కీర్తిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన గడదాసు మణికంఠకు ఘన సత్కారం





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** జపాన్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఒక గోల్డ్ మెడల్,ఒక సిల్వర్ మెడల్ సాధించిన ఓరుగల్లు యువ ప్రతిభ గడదాసు మణికంఠను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన అకాడమీని సందర్శించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ...గత 20 సంవత్సరాలుగా మార్షల్ ఆర్ట్స్‌లోని పది రకాల విద్యలను అభ్యసిస్తూ,వందలాది మంది చిన్నారులకు ఆత్మరక్షణ కళలో శిక్షణ అందిస్తూ మణికంఠ విశేష సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు 23 రాష్ట్రాలలో జరిగిన జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సుమారు 350కి పైగా పురస్కారాలు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం అలాగే,తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి అధికారిక "పోక్సో యాక్ట్ సెల్ఫ్ రియలిస్టిక్ డిఫెన్స్ ట్రైనర్"గా అర్హత సాధించడం ఓరుగల్లు ప్రజలకు గర్వకారణంగా నిలిచింది అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ గౌరవాన్ని తెలంగాణ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన మణికంఠను వారి తల్లిదండ్రులను సత్కరించి,భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ,అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# నేల తల్లికి జీవం పోసే పచ్చిరొట్ట సాగు..

**సేంద్రియ వ్యవసాయంపై రైతులకు పెండెం వెంకన్న పటేల్ పిలుపు**

**45 రోజుల పచ్చిరొట్ట పంటను కలియదున్నిన సేంద్రియ వ్యవసాయ క్షేత్రం**

**నేల సారాన్ని పెంచి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే ఉత్తమ పద్ధతి**

**ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్ట సాగు చేయాలని రైతులకు సూచన**



**తొలి అక్షరం/ఇనుగుర్తి జులై 22:** భూమి సహజ సారాన్ని పెంపొందించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఇనుగుర్తి మండల కేంద్రంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రైతు పెండెం వెంకన్న పటేల్ తన సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో 45 రోజుల పచ్చిరొట్ట పంటను శాస్త్రీయ పద్ధతిలో కలియదున్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల తన సహజ శక్తిని కోల్పోతున్న నేపథ్యంలో, రైతులు ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను వరి, మిరప తదితర ప్రధాన పంటలకు ముందు సాగు చేసి 45 నుంచి 50 రోజుల మధ్య, పూత దశలోనే భూమిలో కలియదున్నితే అత్యుత్తమ ఫలితాలు లభిస్తాయని వెంకన్న పటేల్ వివరించారు. ఈ మొక్కల వేర్లలో ఉండే రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని భూమిలో నిల్వ చేయడం ద్వారా తర్వాతి పంటకు అవసరమైన యూరియా వినియోగం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. అలాగే పచ్చిరొట్ట సాగు వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి భూమి గుల్లబారడంతో పాటు తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని, లోతట్టు పొరల్లోని పోషకాలు పైకి వచ్చి పంటలకు సులభంగా అందుతాయని పేర్కొన్నారు. దట్టంగా పెరిగే ఈ పంటలు కలుపు మొక్కల పెరుగుదలను కూడా నియంత్రిస్తాయని వివరించారు. పచ్చిరొట్టను కలియదున్నిన అనంతరం 10 నుంచి 15 రోజుల పాటు పొలంలో తగినంత తేమ లేదా నీరు ఉండేలా చూసుకుంటే అవి పూర్తిగా కుళ్లి నేలకు సమృద్ధిగా పోషకాలను అందిస్తాయని తెలిపారు. "మంచి పంటకు సారవంతమైన నేలే పునాది. రైతు సోదరులు కొంత ఓపికతో ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్ట సాగు చేసి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి" అని రైతు పెండెం వెంకన్న పటేల్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులపై పోలీసు చర్యకు నిరసనగా షాద్‌నగర్‌లో భారీ ర్యాలీ

**నీట్, సీబీఎస్ఈ అవకతవకలపై ఆందోళన.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

**సోనం వాంగ్‌చుక్ దీక్షకు మద్దతుగా విద్యార్థుల నిరసన**






**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను ఖండిస్తూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించిన ఆందోళనకారులు, నీట్, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలు, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, అదుపులోకి తీసుకున్న వారిపై ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలు తీసుకోరాదని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, విద్యార్థుల సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం విద్యార్థి ప్రతినిధులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. వెంకటయ్య, ఎం. నరసింహులు, ఎం. తిరుమలయ్య, కె. రవీంద్రనాథ్, వి. శ్రీకాంత్, పవన్ చౌహాన్, టీ. కరుణాకర్, జి. శివారెడ్డి, కే. వెంకటయ్య, బి. సత్యం, జె. లక్ష్మీదేవమ్మ, వలిగే కృష్ణ, చంద్రశేఖర్, ఎల్. రాములు, శ్రీను నాయక్, నక్క బాలరాజ్, అర్జునప్ప, ఎం. జనార్ధన్, ఉపాధ్యాయులు మంజుల, కవిత, సీఐటీయూ రాజు, శీను నాయక్, పరంజ్యోతి, గొర్ల రామ, బీశ్వ కృష్ణయ్య, శేఖర్ గౌడ్, ఎస్ఎఫ్ఐ శివతో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు కదలిక

**100 అడుగుల మేర రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు**

**ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**షాద్‌నగర్ ఆర్డీవో ఎన్.ఆర్. సరిత తదితర అధికారుల ప్రజాప్రతినిధుల హాజరు..**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణకు ఎట్టకేలకు కదలిక మొదలైంది. చౌరస్తా విస్తరణకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చౌరస్తా విస్తరణ అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించి, వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సమావేశానికి ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎన్.ఆర్. సరిత మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రజల నుంచి డిమాండ్ వస్తోందన్నారు. చౌరస్తా పరిధిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చౌరస్తా విస్తరణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. విగ్రహాలను గౌరవప్రదంగా మరోచోటికి తరలించి, రహదారి విస్తరణ అనంతరం ప్రజల డిమాండ్ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తామని ఆమె చెప్పారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయన రూపొందించిన రిజర్వేషన్ వ్యవస్థ కారణంగానే తాను ఆర్డీవోగా ఉన్నానని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు విశాల దృక్పథంతో ఆలోచించి సహకరించాలని కోరారు. చౌరస్తాను 100 అడుగుల మేర విస్తరించి, నలువైపులా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. చౌరస్తా పరిధిలోని ఆక్రమణలను తొలగించి, రహదారులను విస్తరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నేత రఘునాయక్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఇనపక ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల పట్ల అందరికీ గౌరవం ఉందని, అయితే ప్రజల రాకపోకలకు, పట్టణ అభివృద్ధికి విగ్రహాలు అడ్డంకిగా మారకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని చౌరస్తా విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ మాట్లాడుతూ చౌరస్తా అభివృద్ధికి ఎమ్మార్పీఎస్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రహదారి విస్తరణ అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని సెంట్రల్ చౌరస్తాలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పరిగి రోడ్డు విస్తరణ కోసం రూ.5.70 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో ఆక్రమణలను తొలగించి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రహదారి విస్తరణలో భాగంగా భవన యజమానులు ఎవరైనా నష్టపోతే వారికి నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రహదారి విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. చౌరస్తా రోడ్డు విస్తరణ ఉద్యమకారుడు ఆర్యన్ రాము మాట్లాడుతూ చౌరస్తా విస్తరణ జరగకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. బీసీ మహిళా నాయకురాలు జయశ్రీ కూడా రహదారి విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ మాట్లాడుతూ రహదారి విస్తరణ అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రధాన చౌరస్తాకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్' గా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణ అభివృద్ధి, ప్రజల రాకపోకల సౌకర్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారాన్ని దృష్టిలో ఉంచుకుని చౌరస్తా విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు కోరారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# “సి ఎ టి సి..IV“క్యాంపులో 613 మందికి సర్టిఫికెట్లను ప్రధానం

### క్యాడెట్ ఉజ్వల భవిష్యత్తు కోసం క్యాంపు ఎంతో దోహదపడుతుంది: కల్నల్ ఎస్ఎస్ రామదురై

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** 22 జులై 2026 కాకతీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఎన్సిసి పదో తెలంగాణ బెటాలియన్ ఎన్సిసి వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో “సి ఎ టి సి..IV“పది రోజుల క్యాంపులో భాగంగా చివరి రోజు 613 మందికి క్యాంప్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.కళాశాలు, పాఠశాలు అధికారుల చేత ఉత్తమ ప్రతిభ క్యాంపులో కనబరిచిన క్యాడేట్స్ కు మెరిట్ సర్టిఫికెట్స్ ఇచ్చారు.ఏ,బి,సి సర్టిఫికెట్ పరీక్షకు హాజరు కావాలంటే ఈ క్యాంపు సర్టిఫికెట్ తప్పనిసరి.పది రోజుల శిక్షణలో ఆర్మీ ద్వారా పొందిన మెలకువలను, నైపుణ్యాలను, డ్రిల్లు,వ్యక్తిత్వ వికాసం,మోటివేషన్ క్లాసులు,పాజిటివ్ థింకింగ్, ఫైరింగ్ యోగ ఫైర్ ఫైటింగ్,ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, ఒత్తిడి నిర్వహణ,సెల్ఫ్ డిఫెన్స్,క్రీడల నైపుణ్యం,ఆయుధాల వాడకం,భారత రక్షణ యుద్ధ తంత్రాలపై పొందిన శిక్షణ భవిష్యత్తు భారతదేశ కొత్త యువత ఆర్మీ ప్రవేశాలపై అవగాహన కల్పించి పొందిన శిక్షణను క్యాడెట్ ఉజ్వల భవిష్యత్తు కోసం క్యాంపు ఎంతో దోహదపడుతుందని కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు.ఈ క్యాంపులో ఆడం ఆఫీసర్ ప్యూటీ కమాండెంట్ లెఫ్టెంట్ కల్నల్ రవి సునారే,క్యాంపు అజ్జుడెంట్ కెప్టెన్ డాక్టర్ పి సతీష్ కుమార్,క్వాటర్ మాస్టర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదా నందం,ఎస్ఎం జై రామ్ సింగ్,లెఫ్టినెంట్ టి.గణేష్, లెఫ్టినెంట్ బి.జీవన్,జూనియర్ కమిషనర్ అధికారులు సుతారి,రాజేంద్రన్,సోను,అనిల్ జాదవ్, అజం అలీ,మురళీకృష్ణ రెడ్డి,కమలాకర్,మూర్తి, మారుతి మద్దం,రామ్నాథ్,గిత్తే, ప్రవీణ్ డాంగ్రే,ఆఫీస్ సూపర్నెంట్ అరుణ,దత్తు,ట్రైనింగ్ విభాగం నుండి కుమారస్వామి,ప్రభావతి,మహేష్,సతీష్,డాక్టర్ రాజీరు, నాగులు,భవాని,సజని, కాత్యాయనని, వెంకటేష్, ఖమ్మం, వరంగల్ నుండి 613 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు.







# ఘనంగా నాయిని 58వ జన్మదిన వేడుకలు

- వరంగల్ పశ్చిమను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలి
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలువాల కార్తీక్



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలువాల కార్తీక్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 58వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అలువాల కార్తీక్ మాట్లాడుతూ...వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థుల మధ్యలో భారీ ఎత్తున కేకు కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది.వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నాయిని రాజేందర్ రెడ్డి ఉన్నతమైన పదవులు చేపట్టి వరంగల్ పశ్చిమను అభివృద్ధి పథంలో నడుపుతూ వరంగల్ పశ్చిమ ప్రజల యొక్క ఆదరణ పొందుతూ ముందుకు సాగుతున్న రాజేందర్ రెడ్డి అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ వరంగల్ పశ్చిమను తెలంగాణలోనే అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని మనసారా ఆ దేవుని కోరుకుంటూ ఇలాంటి అవకాశం కల్పించినటువంటి నాయిని రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్ చంద్,డాక్టర్ ఓ రాజేందర్,మట్టెడ కుమార్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబరాజు రాజకుమార్,ఎండి జాఫర్,భీమ వినయ్ కుమార్,మమ్మద్ కుర్షిత్,మార్త వరుణ్ బాబు,శివకుమార్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్,సౌరం రాహుల్ వర్ధన్,యువజన కాంగ్రెస్ నాయకులు మింటూ,ఇల్లందుల వివేక్,లక్కీ,గాద వివేక్ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దాశరథి సాహిత్య సందేశం



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 22:**మహాకవి దాశరథి జయంతి సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో “దాశరథి సాహిత్యం– సందేశం“ అను అంశంపై విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఆర్.రత్నమంజుల మాట్లాడుతూ దాశరథి తెలంగాణ సాయుధ పోరాటంలో తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచిన గొప్ప కవి అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా విచ్చేసిన హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ మహమ్మద్ హసేన మాట్లాడుతూ దాశరథి తన జీవితాన్ని తెలంగాణ సమాజం కోసం అంకితం చేసిన మహనీయుడని, అద్భుతంగా రచనలు చేయడమే కాకుండా స్వయంగా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన యోధుడని అన్నారు. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని నిజాం నిరంకుశత్వం మీద తిరుగుబాటు చేసిన వీరుడని, అణగారిన పీడిత తాడిత జనుల ఉద్ధరించడం కోసం కవిత్వం రాసిన ప్రజాకవియని, అటువంటి మహనీయుని నుండి ప్రతి ఒక్కరు స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్నబాబు, ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. లక్ష్మీ నీలిమ, అధ్యాపకులు అద్దంకి ఆంజనేయులు, డాక్టర్ జి.సునీత డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను,జె. నరేశ్ తదితర అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాక్షస పాలనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ గ్యారేజ్: దాస్యం

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కేటీఆర్ నిరుద్యోగ భరోసా ఉచిత ఆన్లైన్ కోచింగ్ యాప్ ఆవిష్కరించిన అతిధులు కేటీఆర్ 50 బర్త్ డే సందర్భంగా 50 కేజీల కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.నిరుద్యోగులు ఉచిత ఆన్లైన్ యాప్ ను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.కేటీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని హనుమకొండలో దివ్యంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగుల కోసం రూపొందిచిన ఉచిత ఆన్ లైన్ కోచింగ్ యాప్ ను ప్రారంభించిన ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్,గండ్ర వెంకట రమణ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్,మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్,నాగుర్ల వెంకన్న,మర్రి యాదవ రెడ్డి,నేషనల్ మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ళ రాఘవేంద్ర తదితరులు.దివ్యంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి సభ అధ్యాక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లు దాస్యం వినయ భాస్కర్,గండ్ర రమణ రెడ్డి,ఆరూరి రమేష్ లు మాట్లాడారు.వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ...నాడు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో నీళ్ల కోసం,ఉద్యోగాల కోసం ఉద్యమాలు చేసి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రన్నీ సాధిస్తే,10 సం. రాల తరువాత మళ్ళీ అవే రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోచ్చిందన్నారు.సాధించుకున్న తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక ఉద్యోగాలు ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు నిరుద్యోగుల ఓట్ల కోసం అనేక మోసపూరిత వాగ్దానాలు చేసి అదికారంలోకి వచ్చింది.నిరుద్యోగుల కోసం బిఆర్ఎస్ పార్టీ ఎపుడు అండగా ఉంటుందని,ఆన్లైన్ కోచింగ్ సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు భవిష్యత్తులో ఉన్నంత శిఖరాల అధిరోహించాలని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ...కేసీఆర్ నీళ్ళు నిధులు నియామకాల పై ప్రత్యేక దృష్టి పెట్టీ వాటిని సమకూర్చారు.కేటీఆర్ పెద్ద పెద్ద కంపెనీలను 2 టైర్ సిటీ లలో నెలకొల్పారు.రాక్షస పాలనకు వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ గ్యారేజ్ పనిచేస్తుందన్నారు.మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ...2001 నుండి కేసీఆర్ తెలంగాణకు కు జరుగుతున్న అన్యాయాన్ని లక్ష 65 వేల ఉద్యోగాలు ఇచ్చినా ఏ ఒక్క రోజు కూడా చెప్పుకోలేదన్నారు.అబద్దాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చారు.రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాన్ని యువత నిలదీయాలన్నారు.మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ...నీట్ పరీక్ష పాత్రల లీకేజీ జరిగిందని డిల్లీ లో యువత నిరసన తెలుపుతుంటే బీజేపీ ప్రభుత్వం పిలిచి మాట్లాడకుండా లాఠీచార్జి చేసింది.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులు మోసం చేస్తున్నాయి అని అన్నారు.గోదావరి నీరు వృథాగా సముద్రం లో కలుస్తున్నా రేవంత్ రెడ్డి నిద్ర పోతున్నాడు.వ్యవసాయ రంగానికి నీరు ఇవ్వకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం అని చెప్పారు.ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ...తెలంగాణ నిరుద్యోగులు ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేస్తుంటే ఎటు వెళ్ళాడు.కాంగ్రెస్ పార్టీ డిల్లీ లో ఒకలా తెలంగాణలో ఒకలా ఉన్నది.నిరుద్యోగ భృతి ఇస్తాం అని చెప్పి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు.2లక్ష ఉద్యోగాలు ఇవ్వకుంటే గద్దె దించే వరకు పోరాటం చేయాలి.మీ వెనక బి ఆర్ ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు.కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా 50 కిలోల కేకు ను కట్ చేయడంతో పాటు...కళాకారుల ఆటపాటలతో ఆద్యాంతం...ఫంక్షన్ హాల్ కిటకిటలాడింది.నిరుద్యోగ యువతీ,యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కేటీఆర్ జన్మదినం సందర్భంగా తయారు చేసినటువంటి ఏవీని చూస్తూ కొంతమంది కన్నీటి పర్యంతమయ్యారు.స్వరాష్ట్రం కోసం పాటుపడిన కేటీఆర్ కు ఇంత ఉద్యమ చరిత్ర ఉందా అని వచ్చిన యువత అంత అనుకున్నారు.అనంతరం 50 వ బర్త్ డే సందర్భంగా 50 కిలోల కేకు ను అతిధుల సమక్షంలో కట్ చేసి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వచ్చినటువంటి అతిధులకు వాసుదేవ రెడ్డి పూల బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు,మాజీ కార్పొరేటర్లు,విద్యార్థి ఉద్యమకారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# షాద్‌నగర్ రోడ్డు విస్తరణకు ఇక ఆలస్యం వద్దు: బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణ పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప కోరారు. ఆర్డీవో ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన ఆయన, ఎన్నేళ్లుగా ఆలస్యానికి కారణాలను ప్రజలకు వెల్లడించాలని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నేపథ్యంలో పనులను సోమవారం నుంచే వేగంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణకు నిర్ణయం తీసుకున్న ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నీట్ పరీక్ష అక్రమాలపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి



- జూలై 24న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు

**తొలి అక్షరం/(రామన్నపేట) జూలై 22:**నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలు, అవకతవకలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఏర్పడిన లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవినీతి ఆరోపణలతో జాతీయ పరీక్షల వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసం దెబ్బతిన్నదన్నారు.ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాస్వామిక వాదులు విజయవంతం చేయాలని కోరారు.విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా చేపడుతున్న నిరసనలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం అత్యంత అమానుషమని, నిరసన తెలిపే హక్కును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల గొంతును అణచివేయడం మానుకుని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.ఎన్‌టీఏ ను రద్దు చేసి నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై పారదర్శకంగా విచారణ జరిపించాలి.దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి.విద్యార్థులపై పోలీసుల దాడులను నిలిపివేసి, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి.చివరగా, కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా జూలై 24న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేసి, విద్యార్థుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలియజేయాలని వేముల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్,జిల్లా కమిటి సభ్యురాలు పెద్ది అక్షిత,నాయకులు అప్పం అభిరుప్, నవదీప్ మానస ఉమరేఖ సంతోషం శివాని పాల్గొన్నారు

# షాద్‌నగర్‌లో అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు ఆక్రమణలు..

### జీతాలు తీసుకుంటు పనిచేయకుండా ఆఫీస్‌లలో కూర్చుంటే కుదరదు

### చౌరస్తా విస్తరణ కొరకు విగ్రహాలను ముందు పెట్టి కాలయాపన కాదు. ముందు ఆక్రమణలు తొలగించండి

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** అధికారుల నిర్లక్ష్యంతోనే షాద్ నగర్ పట్టణంలో రోడ్ల ఆక్రమణ ఇదేచగా జరుగుతుందని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో చౌరస్తా విస్తరణ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర నేత పినపాక ప్రభాకర్ అధికారుల తీరుపై మండిపడ్డారు. రోడ్లు ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఏంచేస్తున్నారని, ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమే అని, ఇప్పుడు చౌరస్తా విస్తీర్ణం కోసం అక్కడ విగ్రహాలను వేరే చోటికి తరలించడం కోసం సమావేశం పెట్టి కాలయాపన చేస్తే కుదరదని, ముందుగా రోడ్డు ను ఆక్రమించిన నిర్మాణాలను తొలగించాలని ఆతరువాత విగ్రహాల గురించి మాట్లాడడం సరైంది అన్నారు. శాశ్వత నిర్మాణాలను, బుగ్గారెడ్డి భవనం , కోటీశ్వరుల నిర్మాణాలు కాకుండా చిన్న చిన్న వ్యాపారులను , డబ్బాలను తొలగించి చేతులు దులుపుకోకుండా, ఎంతటి వారైనా అక్రమంగా ఆక్రమించిన నిర్మాణాలు తొలగించి చౌరస్తా విస్తీర్ణం చేయాలని కోరారు.



# హనుమకొండలో 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం..

## విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది

## తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** దేశ భవిష్యత్తును నిర్మించే యువతకు నాణ్యమైన విద్య,పారదర్శకమైన పరీక్షా విధానం,సమాన అవకాశాలను కల్పించడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని,అయితే కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కిషన్ పుర లో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,శాసనమండలై సభ్యులు శంకర్ నాయక్,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి,అయూబ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,విద్యార్థులు,యువజన ప్రతినిధుల కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గత కొన్నేళు ్లగా దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకులు,పరీక్షల రద్దులు,రీ-ఎగ్జామ్స్ వంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూ లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళన,మానసిక వేదనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులు నెలల తరబడి,సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షలు రాస్తే,చివరికి ప్రశ్నాపత్రాల లీకుల కారణంగా వారి కృషి వృథా కావడం అత్యంత బాధాకరమని అన్నారు.నీట్ - యూజి 2026 పరీక్ష రద్దు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితిని సృష్టించిందని,పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు,అనంతరం వెలుగులోకి వచ్చిన ఆరోపణలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేశాయని పేర్కొన్నారు.ఈ ఘటనల నేపథ్యంలో అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని,కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన విషాద ఘటనలు దేశాన్ని కలచివేశాయని అన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.ప్రశ్నాపత్రాల లీకులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని,బాధ్యులపై చర్యలు తీసుకునే బదులు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు."విద్యార్థులు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే వారిపై అమానుషంగా లాఠీలు ఎత్తడం అత్యంత దురదృష్టకరం.ఒకప్పుడు స్వాతంత్ర్య ఉద్యమంలో 'మమ్మల్ని కొట్టండి, దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వండి' అని పోరాడిన యువత చరిత్రను మనం చదివాం. నేడు 'మమ్మల్ని కొట్టండి కానీ మాకు న్యాయం చేయండి' అని విద్యార్థులు దెబ్బలు తింటున్న పరిస్థితి రావడం బాధాకరం" అని అన్నారు.విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ,కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు శాంతియుత నిరసన చేపట్టగా,వారిని బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని





విమర్శించారు.పార్లమెంట్ లో నీట్ పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం,బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం ప్రజల అనుమానాలను మరింత పెంచుతోందన్నారు.దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు ర్యాలీలు నిర్వహిస్తున్నారని,అయితే ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి మద్దతుగా ర్యాలీలు చేస్తున్నారా? లేక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయొద్దని ర్యాలీలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.తన రాజకీయ ప్రస్థానం కూడా విద్యార్థి నాయకుడిగానే ప్రారంభమైందని గుర్తు చేసుకున్న మంత్రి,విద్యార్థి ఉద్యమాల నుంచే ప్రజాసేవలోకి వచ్చానని చెప్పారు.విద్యార్థి శక్తి ఎన్నో చారిత్రక మార్పులకు కారణమైందని,దేశ భవిష్యత్తును మార్చే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు.రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ యువతతో కలిసి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గత పదేళ్లలో దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు,ప్రవేశ పరీక్షలు వివాదాల్లో చిక్కుకోవడం వల్ల యువతలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు.పరీక్షా వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటే దేశ భవిష్యత్తుకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు.యువత కష్టపడి చదివి సాధించిన ప్రతిభకు విలువ దక్కేలా పారదర్శకమైన,నిష్పక్షపాతమైన,భద్రమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రశ్నాపత్రాల లీకులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,పరీక్షల నిర్వహణలో సంపూర్ణ సంస్కరణలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.దేశ యువత కలలను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని,వారి ఆశలను చిదిమివేసే వ్యవస్థ కాదు,వారి ప్రతిభను గుర్తించి సమాన అవకాశాలు కల్పించే పాలన దేశానికి అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడు జాంగారి రవి జన్మదిన వేడుకలు

**జాంగారి రవికి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం**

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జాంగారి రవి జన్మదిన వేడుకలు**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జాంగారి రవి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి. రఘునాయక్, వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన



ఈ వేడుకల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాంగారి రవికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి. రఘునాయక్ తదితరులు జాంగారి రవికి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమంలో జాంగారి రవి చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పెంటయ్య, కొప్పునూర్ ప్రవీణ్, రాజు నాయక్, కాంగ్రెస్ నేతలు బాధేపల్లి సిద్ధార్థ, సింగపాగ అనిల్ కుమార్, లింగారెడ్డిగూడ అశోక్, జాంగారి జంగయ్య, కావాలి జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నడికూడ యాదగిరి యాదవ్, జేఏసీ నేతలు జనార్దన్, నక్క బాలరాజ్ యాదవ్, పరంజ్యోతి, టీఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, అన్నారం నర్సింహులు, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చౌరస్తా విస్తరణకు ఏకగ్రీవ ఆమోదం.. అందరికీ ఆర్ఎన్ రాము శుభాకాంక్షలు



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 22:** షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణకు నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్ల చౌరస్తా ఉద్యమకారుడు ఆర్ఎన్ రాము హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీవో సరిత సూచన మేరకు విస్తరణ పనులను త్వరలో ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయం పట్టణ అభివృద్ధికి కీలకమని అన్నారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చౌరస్తా విస్తరణకు మార్గం సుగమం కావడం ఆనందదాయకమని పేర్కొన్న ఆయన, ఈ ప్రక్రియలో సహకరించిన ఆర్డీవో సరిత, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, వ్యాపారులు, పట్టణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.షాద్‌నగర్ అభివృద్ధికి ఈ రోడ్డు విస్తరణ మైలురాయిగా నిలుస్తుందని, పనులు త్వరగా ప్రారంభమై సకాలంలో పూర్తవాలని ఆకాంక్షిస్తూ అందరికీ అభినందనలు తెలిపారు.

# చిన్నారిని ఆశీర్వదించిన గర్దాసు విక్రమ్



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 22:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో 8వవార్డ్ సభ్యులు పుట్టల లక్ష్మమ్మ-ముత్యాలు కుమారుడు సాయికుమార్-జ్యోతిల కుమార్తె కావ్య దీక్ష మొదటి జన్మదిన మహోత్సవం లో పాల్గొని చిన్నారిని ఆశీర్వధించిన.సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, సింగణబోయిన గణేష్ యాదవ్,గర్ధాస్ వినయ్,చిన్నపాక శ్రీనివాస్,మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య, రవ్వ నర్సింహా చేనేత సహకార సంఘము అధ్యక్షులు, రాస వెంకటేష్,పుట్టల దానేష్,పుట్టల బాలకృష్ణ,చిన్నపాక సురేష్,మంటి శంకర్,పగుడాల నరేందర్,బోనగిరి మధు, వెలిమినేటి నరేష్ తదితరులుపాల్గొన్నారు



# భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా (బీజేవైఎం) కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సంగ నరేష్..

**తొలి అక్షరం/కరీంనగర్ జూలై 22:** భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా చొప్పదండి పట్టణానికి చెందిన సంఘ నరేష్ ను నియమిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేవైఎం నూతన అధ్యక్షులుగా నియమితులైన నరేష్ మాట్లాడుతూ జిల్లాలో బీజేవైఎం బలోపేతానికి, యువతలో దేశభక్తి , జాతీయతా భావం పెంపొందించడానికి సామాజిక సేవ లో యువతను భాగస్వామ్యం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్, బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణా రెడ్డి ,కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ,డిప్యూటి మేయర్ సునిల్ రావు ,కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్ రావు , బిజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ లకు రాష్ట్ర,జిల్లా పార్టీ పెద్దలకు, నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం

- **ముఖ్యఅతిథిగా టిడిపిపొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు...**

**తొలి అక్షరం/మహబూబ్నగర్, జులై 22:** మహబూబ్నగర్ నియోజకవర్గం మహబూబ్నగర్ మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను జాతీయ తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు,బక్కని నరసింహులు ఎగురవేశారు. ఈ సందర్భంగా బక్కని నరసింహులు గారు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు గారు 1982లో తెలుగుదేశం పార్టీని ప్రారంభించడం జరిగింది.నీతీ,నిజాయతీగా రాష్ట్రాన్ని పాలించి ఎంతో మందికి రాజకీయ అవకాశం కల్పించారని బడుగు,బలహీన వర్గాలకు ఉండడానికి ఇల్లు,కట్టడానికి బట్ట ,తినడానికి తిండి ,2రూపాలకి కిలో బియ్యం,జనతా వస్త్రాల పంపిణి పటేల్ పట్వారి వ్యవస్థని రద్దు రద్దు చేశారు.
మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు.ప్రజలకు మండలాల ద్వారా పరిపాలన విధానాన్ని తీసుకొచ్చిన మహనీయుడు నలుదిశలా తెలుగువారి ఆత్మా గౌరవాన్ని తెలియజేసిన మారుమూల ప్రాంతాల ప్రజలకు రాజకీయం అంటే తెలియజేసిన నాయకుడు నందమూరి తారక రామారావు అని తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు జిల్లాలో గతంలో 54 పర్యటించారని తెలిపారు.అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు.తెలంగాణలో 515 మంది ప్రమాద బీమా లబ్ధి పొందారని సుమారు 10,495000 కోట్ల రూపాయలు పార్టీ ద్వారా రాష్ట్రంలో పంపిణీ చేశామని, సగౌరవంగా తెలిపారు.
సీఎం చంద్రబాబు నాయుడు గారు.మంత్రి నారా లోకేష్ , వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమా 2 లక్షల నుంచి 5 లక్షల పెంచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీ బక్కని నరసింహులు గారు మహబూబ్నగర్ పార్లమెంటు నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రాములు యాదవ్,సాయన్న గౌడ్, బాల్రెడ్డి, మండల నాయకులు శ్రీనివాసులు,మురళి, అంజమ్మ,ఆంజనేయులు, రాఘవేందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాంగ్రెస్ వీధి నాటకాలకు బీజేపీ దీటైన జవాబు

హనుమకొండ అశోక చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం
కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు
బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి

**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు చేసిన వీధి నాటకాలకు,సృష్టించిన అరాచకాలకు దీటైన జవాబు ఇస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి హెచ్చరించింది.అరాచకాలు సృష్టించడం కాంగ్రెస్ నైజమైతే,ప్రజాస్వామ్యాన్ని కాపాడటం బీజేపీ విధానమని పగడాల కాళీ ప్రసాద రావు స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న దిగజారుడు వీధి రాజకీయాలను,కుట్రలను క్షేత్రస్థాయిలో అంతే కఠినంగా ఎదుర్కొంటామని తేల్చిచెప్పింది.కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోక చౌరస్తాలో బీజేపీ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు,కార్యకర్తలు దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు



రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రంలో రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఢిల్లీలో ధర్నాల్లో పాల్గొనడం సిగ్గుచేటని విమర్శించారు.కాంగ్రెస్ నాయకులు విద్యార్థుల కోసం కాకుండా రాజకీయ స్వార్థం కోసమే నిరసనలు చేస్తున్నారని మండిపడ్డారు.అధికారంలో ఉన్నప్పుడు ఒకలా,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట మార్చి ప్రజలను ఏమార్చడం ఒక్క కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని,స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుందని ధ్వజమెత్తారు.ఢిల్లీలో ప్రధాని నివాసం వద్ద అరాచక మూకల్లా ప్రవర్తిస్తూ విధ్వంసాలు సృష్టిస్తున్న కాంగ్రెస్,ఇక్కడ తెలంగాణలో మాత్రం పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని,ఇది వారి ద్వంద్వ వైఖరికి,నియంతృత్వానికి నిదర్శనమని అన్నారు.రాహుల్ గాంధీ ఎన్ని డ్రామాలు ఆడినా దేశ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక,అరాచక విధానాలపై భారతీయ జనతా పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర,జిల్లా,డివిజన్,మండల స్థాయి నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరిగి జట్టులోకి వచ్చిన కమిన్స్, హేజిల్‌వుడ్, లైయాన్

- బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు

**ఆస్ట్రేలియా జట్టు ప్రకటన**



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా.. వరుసగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం బలమైన జట్టును బరిలోకి దింపుతోంది. వచ్చే నెలలో జరగనున్న ఈ మ్యాచ్‌లకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా తాజాగా జట్టును ప్రకటించింది. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో 13 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. గాయం నుంచి కోలుకున్న జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయాన్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 2025-27లో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌తో ఆ జట్టు సీనియర్లు పునరాగమనం చేయనున్నారు. గాయాల కారణంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లైయాన్ బంగ్లా సిరీస్‌తో ఎంట్రీ ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి 13 మందితో స్క్వాడ్‌ను ఎంపిక చేశామని, అవసరాన్ని బట్టి మార్పులు చేస్తామని, అందుకోసం తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ పేర్కొన్నాడు.ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఆస్ట్రేలియా, ఎనిమిది మ్యాచ్‌లలో ఏడు విజయాలు, ఒక ఓటమితో, 87.50 విజయ శాతంతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. బంగ్లాదేశ్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి.. అగ్రపీఠాన్ని మరింత పదిలం చేసుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. ఆస్ట్రేలియా వచ్చే 8 నెలల వ్యవధిలో 14 టెస్టులు ఆడనుంది. ఇందులో భారత్ వేదికగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కూడా జరగనుంది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు 18 ఏళ్ల తర్వాత టెస్టులు ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళ్తోంది. ఆగస్టు 13 నుంచి ఆగస్టు 26 వరకు ఇరుజట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరుగనుంది.బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టు: ప్యాట్‌పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుషేన్, నాథన్ లియాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్

# కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై విమర్శలు

- టీమిండియాపై

**మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ ఆగ్రహం**



లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో బ్యాటింగ్‌కు పంపడంపై భారత మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో 388 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. రాహుల్ బ్యాటింగ్ స్థానాన్ని మార్చడంపై ప్రశ్నలు లేవనెత్తారు. "అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతడు జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు కదా. రాహుల్ నంబర్ 6 లేదా 7 స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా? ఇది చాలా అన్యాయం. అతడి బాడీ లాంగ్వేజ్ కూడా ఏదో ఆందోళనలో ఉన్నట్లుగా అనిపించింది" అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. ఒకవేళ లార్డ్స్ వన్డేలో కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచకప్ మాదిరిగా విరాట్ కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతడిని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను గెలిపిస్తాడా?" అని శ్రీకాంత్ ప్రశ్నించారు. కాగా భారత్ స్కోరు 304/4 వద్ద ఉన్నప్పుడు రాహుల్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అప్పటికి ఓవర్‌కు దాదాపు 15 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో రాహుల్ ఔట్ అయ్యాడు. 12 బంతుల్లో 8 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ వన్డే సిరీస్‌లో రాహుల్ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. తొలి వన్డేలో ఒక పరుగు చేసిన అతడు, లార్డ్స్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 12 పరుగులు చేశారు. గాయం కారణంగా రెండో వన్డేకు దూరమయ్యాడు.

# యూకే పిచ్‌లు సవాల్ విసురుతాయి

**అందుకే అక్కడ మేం ఓడిపోయాం**

**భారత యువ క్రికెటర్ తిలక్ వర్మ**



భారత క్రికెట్ జట్టులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు కుర్రాడు తిలక్ వర్మ విదేశీ పర్యటనలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు అభిమానుల నుంచి భారీ అంచనాలు ఉంటాయని చెప్పాడు. ఇదే సమయంలో జట్టు యాజమాన్యం నుంచి బాధ్యతలు ఉంటాయని తెలిపాడు. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో వాతావరణం, పిచ్ పరిస్థితులు ఎంతో భిన్నంగా ఉన్నాయని తిలక్ అభిప్రాయపడ్డాడు. కాగా గత రెండేళ్లలో అంటే టీ20 ప్రపంచకప్ 2024 జరిగిన తర్వాత, భారత జట్టు ఆడిన మ్యాచ్‌లలో మెజారిటీ ఆసియా ఖండంలోనే జరిగాయి. ఈ పరిస్థితుల్లో స్వదేశీ పిచ్‌లతో పాటు ఉపఖండంలోని అనుకూలమైన మైదానాల్లో ఎక్కువగా ఆడిన తర్వాత, నేరుగా విదేశీ పరిస్థితులకు మారి అక్కడ ఆడటం సవాల్‌తో కూడుకున్న విషయమని తిలక్ వర్మ అన్నాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఐర్లాండ్ వంటి దేశాల్లో బంతి అనూహ్యంగా స్వింగ్ అవ్వడం, సీమ్ కావడం వల్ల బ్యాటర్లు తమ శైలిని మార్చుకోవాల్సి వస్తుందని అతడు వెల్లడించాడు. ఇదే సమయంలో ఇంగ్లాండ్ జట్టును తిలక్ వర్మ ప్రశంసించాడు. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ ఎంత అత్యుత్తమమైన జట్టో అందరం చూశామని అతడు గుర్తు చేశాడు. అంతటి పటిష్టమైన జట్టును, వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం సవాల్ విసురుతుందని వివరించాడు. విదేశీ వేదికలపై అగ్రశ్రేణి జట్లతో ఆడేటప్పుడు దక్కే అనుభవం యువ ఆటగాళ్లకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని.. సవాళ్లను ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని పెంచుతుందని పేర్కొన్నాడు. ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత యువ జట్టుకు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ పర్యటన ద్వారా మళ్లీ పాత ఫామ్‌ను అందుకోవాలని చూస్తున్నాడు. విదేశీ పర్యటనలలో ఎదురైన ఓటములు, కష్టమైన పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకుని.. మెరుగ్గా రాణిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ఐర్లాండ్ చేతిలో 0-2, ఇంగ్లాండ్ చేతిలో 0-4 తేడాతో భారత్.. టీ20 సిరీస్‌లలో ఓడిపోయింది. జులై 23 నుంచి భారత్, జింబాబ్వే టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.



# వైభవ్ ఆటగాడిని చూడలేదు

- సూర్యవంశీపై హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. వైభవ్ లాంటి ఆటగాడిని తాను ఇప్పటివరకు చూడలేదని కొనియాడాడు. వైభవ్ అత్యంత ప్రతిభావంతమైన ఆటగాడని, గతంలో ఏ ఆటగాడు సాధించని ఘనతను అందుకుంటున్నాడని కితాబిచ్చాడు.ఇంగ్లండ్ పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. ఇంగ్లండ్‌తో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన వైభవ్.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. గురువారం హరారే వేదికగా జరిగే మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్ నేపథ్యంలో జియోస్టార్ షోలో మాట్లాడిన హర్భజన్ సింగ్.. వైభవ్ సూర్యవంశీ ఫియర్‌లెస్ బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్నట్లు గతంలో ఎవరూ ఆడలేదు. అతను అసాధారణ నైపుణ్యం కలిగిన ప్లేయర్. ఇలాంటి ఆటగాడిని నేను ఇప్పటి వరకు చూడలేదు. ఒకప్పటి యువతకు.. ఇప్పటి కుర్రాళ్లకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం మీడియా, సోషల్ మీడియా. అప్పట్లో కూడా ఇలాంటి ఆటగాళ్లు ఉన్నారేమో. కానీ ఈ రోజుల్లో సోషల్ మీడియా ద్వారా ఎక్కువగా వెలుగులోకి వస్తున్నారు.ఫియర్‌లెస్ మనస్తత్వం, తమకు నచ్చే విధంగా ఆడే ఆటగాళ్లను జనాలు అంగీకరించడమే ఆటలో వచ్చిన అతి పెద్ద మార్పు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. 'రాజస్థాన్ రాయల్స్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఉన్న సమయంలో వైభవ్ సూర్యవంశీని తొలి బంతిని ఎలా ఆడుతావు? అని అడిగాడు. దానికి వైభవ్.. అది నా జోన్‌లో ఉంటే సిక్స్ బాదుతానని బదులిచ్చాడు. అన్నట్లుగానే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో తొలి బంతినే సిక్స్ బాది తన ఐపీఎల్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. ఇది వైభవ్ ఫియర్‌లెస్ మనస్తత్వాన్ని తెలియజేస్తోంది'అని తెలిపాడు. తన కెరీర్‌లో సచిన్ టెండూల్కర్ ఇచ్చిన సలహాను ఎప్పటికీ మర్చిపోనని హర్భజన్ సింగ్ గుర్తు చేసుకున్నాడు. 'క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ నాకు ఇచ్చిన సలహాను నేను ఎప్పటికీ మర్చిపోను.'నీ క్రికెట్ ప్రయాణంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి. ఎన్నో విషయాలు నీ దారిలోకి వస్తాయి. కానీ ఎటువైపు నీ మనసును మళ్లించకుండా ఆటపై మాత్రమే దృష్టిని పెట్టాలి. ఇలా కొనసాగితేనే ఈ ప్రపంచంలో నిన్ను ఎవరూ ఆపలేరు. నువ్వు ఏది అవ్వాలనుకున్నా.. ఏది చేయాలనుకున్నా.. నువ్వు సరైన మార్గంలో నడిస్తేనే.. అన్ని రకాల గౌరవం, కీర్తిని పొందుతావు.'అని సచిన్ పాజీ నాకు చెప్పాడు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ఇదే సలహాను వైభవ్ సూర్యవంశీతో పాటు ఈ తరం యువ ఆటగాళ్లకు ఇవ్వాలనుకుంటున్నాను. 'ఆటపైనే ఫోకస్ పెట్టాలి. ఆట కంటే మనం పెద్ద కాదనే విషయాన్ని గ్రహించాలి. ఈ ఆట వల్లే మనం ఈ స్థాయికి వచ్చామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నీ వైఖరి సరిగ్గా లేకపోతే.. ఈ ఆట ఎంత ఇచ్చిందో అంతే వేగంగా వెనక్కి తీసుకుంటుంది.'అని హర్భజన్ సింగ్ హెచ్చరించాడు.

# నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు

- 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్స్




**గ్లాస్గో (స్కాట్లాండ్) :** స్కాట్లాండ్‌లోని పోర్ట్‌నగరం కామన్‌వెల్త్ క్రీడలకు స్పోర్ట్స్ క్యాపిటల్‌గా మారింది!. 2014లో కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన గ్లాస్గో నగరం.. 2026 క్రీడల ఆతిథ్యం నుంచి ఆస్ట్రేలియా తప్పుకోవటం మరోసారి నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. ఆర్థిక సవాళ్లు, నిర్వహణ వ్యయ భారం కామన్‌వెల్త్ క్రీడలను కళ తప్పేలా చేశాయి. 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్లతో నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు ఆరంభం కానున్నాయి. బ్రిటీష్ పాలిత దేశాలు పోటీపడే ఈ క్రీడల్లో ఈసారి 74 దేశాల నుంచి సుమారు 3 వేల మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. నేటి ఆరంభ వేడుకలతో పోటీలు ప్రారంభం కానుండగా.. ఆగస్టు 2న ముగింపు వేడుకలతో క్రీడలు ముగియనున్నాయి. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాలు ఉండగా.. తాజాగా గ్లాస్గోలో వాటిని 10కు కుదించారు. బాస్కెట్‌బాల్, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, బౌల్స్, బాక్సింగ్, జూడో, నెట్‌బాల్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో 74 దేశాల క్రీడాకారులు పోటీపడనున్నారు. పారా విభాగంలో ఆరు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. తొలి రోజు పోటీల్లో బౌల్స్, పారా బౌల్స్ ఈవెంట్లు జరుగనున్నాయి. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ 125 మందితో కూడిన బలమైన జట్టును పంపిస్తోంది. ఒలింపిక్ పతక విజేతలు నీరజ్ చోప్రా, మీరాబాయి చాను వంటి మేటి అథ్లెట్లు గ్లాస్గోలో బరిలోకి దిగుతున్నారు.



# సింధు, సేన్ ముందంజ

**చాంగ్జౌ :** జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన జోష్‌లో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు.. చైనా ఓపెన్‌నూ విజయంతో ఆరంభించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 21-14, 9-21, 21-10తో భారత్‌కే చెందిన యువ షట్లర్ ఉన్నతి హుడాను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది.పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. 22-20, 15-21, 21-14తో యుశి టనాక (జపాన్)ను చిత్తుచేశాడు. మరో పోరులో భారత యువ సంచలనం ఆయుష్ శెట్టి.. 21-17, 5-21, 21-17తో ప్రపంచ 11వ ర్యాంకర్ అల్వి ఫర్హాన్ (ఇండోనేషియా)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తనీషా క్రాస్టో జంటతో పాటు మెన్స్ డబుల్స్‌లో అర్జున్-హరిహరన్ జోడీ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టింది.

# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి



స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.




# రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.


# స్పిరిట్ 40శాతం షూటింగ్ పూర్తి

## కీలక అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.


# సంక్రాంతి బరి నుంచి చిరు తప్పకున్నారా ?



ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచు కోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గరిష్ట స్థాయిలో వసూళ్లు రావాలంటే పోటీ లేకుండా సోలోగా విడుదల చేయడం ఉత్తమమనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి సమయంలో కనీసం రెండు లేదా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో, కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారట. అందుకే సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని సమ్మర్ లేదా మరో అనుకూలమైన ఫెస్టివల్ సీజన్‌లో సినిమాను విడుదల చేసే అంశంపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# వారానికి 4 రోజులే పనా?.. భారతదేశానికి అది సాధ్యం కాదు: నటుడు విక్రాంత్ మాస్సే

ఉత్తర యూరప్ దేశాల్లో మాదిరిగా వారానికి నాలుగు రోజులే పనిచేసే 'ఫోర్-డే వర్క్ వీక్' నమూనా ప్రస్తుతానికి భారతదేశానికి అస్సలు సరిపడదని ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే అభిప్రాయపడ్డారు. తన రాబోయే వెబ్ సిరీస్ 'ముసాఫిర్ కేఫ్' ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పనివేళలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై తన స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, యువ ప్రతిభ కలిగిన ఈ ప్రజాస్వామ్య దేశం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే 40 నుంచి 50 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.ముఖ్యంగా వినోద పరిశ్రమ గురించి మాట్లాడిన విక్రాంత్, సినీ నిర్మాణం అత్యంత వ్యయంతో కూడుకున్న వ్యవహారమని వ్యాఖ్యానించారు. షూటింగ్‌లో 12 గంటల షిఫ్ట్ ఉన్నప్పటికీ, నిజానికి కేవలం నాలుగు లేదా ఐదు గంటలు మాత్రమే కెమెరా ముందు పనిచేస్తామని వివరించారు. బడ్జెట్ పరిమితులు, ప్రాక్టికల్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు 16 నుంచి 17 గంటలు కూడా పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. రుచిర్ అరుణ్ దర్శకత్వంలో మహిమా మక్వానా, వేదిక పింటోలతో కలిసి విక్రాంత్ నటించిన ప్రేమకథా చిత్రం 'ముసాఫిర్ కేఫ్' జులై 24న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుంది. ఇందులో చందర్ పాత్రలో తన నటన కొత్త భావోద్వేగాలను ఆవిష్కరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# విజయ్ 'జన నాయగన్'పై అనిల్ రావిపూడి ఆసక్తికర వ్యాఖ్యలు


తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన పొలిటికల్ డ్రామా 'జన నాయగన్' చిత్రంపై టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు, తమిళ సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాపై ఆయన తన అభిప్రాయాలను పంచుకోవడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు దీనిపై జోరుగా చర్చిస్తున్నారు.అనిల్ రావిపూడి మాట్లాడుతూ, 'జన నాయగన్' చిత్రంపై తనకున్న అంచనాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలు ప్రేక్షకుల్లో తీవ్ర కుతూహలాన్ని పెంచుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజయ్ సినిమాపై మరో పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రమే ఈ సినిమాకు స్ఫూర్తి అని దర్శకుడు హెచ్. వినోద్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన అనిల్ రావిపూడి భగవంత్ కేసరిలోని కొన్ని సన్నివేశాలను మాత్రమే 'జన నాయగన్' కోసం తీసుకున్నారని స్పష్టం చేశారు. విజయ్ స్టార్‌డమ్‌కు తగిన రీతిలో దర్శకుడు వినోద్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారని ఆయన కొనియాడారు.






# నన్ను అపార్థం చేసుకున్నారు

## నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే పక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా?స్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్ వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.